క్లుప్తంగా

బాధిత కుటుంబానికి అండ



సాయం అందిస్తున్న సభ్యులు

కుంటాల: మండలంలోని అందాకూర్ గ్రామానికి చెందిన బక్వాడ గంగాధర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయన మండలంలోని ఓలా గ్రామస్తులతో కలిసి హనుమాన్ దీక్ష స్వీకరించేవాడు. శనివారం హనుమాన్ సేవా సమితి సభ్యులు మృతుడి భార్య సాగరకు రూ.22,500 నగదు అందజేశారు. కార్యక్రమంలో హనుమాన్ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆట వస్తువుల విరాళం

ముధోల్: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలకు శనివారం పూర్వవిద్యార్థి ధర్మపురి రజనీస్-స్వాతి దంపతులు రూ.10 వేల విలువైన ఆట వస్తువులను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి కంది మానాజీ, సహా కార్యదర్శి వేద పాఠక్, నిశికాంత్, ప్రధానాచార్యులు సారథిరాజు, ఆచార్యులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



రికార్డు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ శ్రీలత

ఖానాపూర్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. శనివారం మండలంలోని రాజూరా, చందునాయక్‌తండా, దేశ్యానాయక్‌తండా అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి సూచనలు చేశారు.

చిన్నారులకు టీకాలు వేయించాలి

ఖానాపూర్: ప్రతీ శని, బుధవారాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే ఆరోగ్య శిబిరంలో చిన్నారులకు వారి తల్లిదండ్రులు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఏఎన్‌ఎం పద్మ అన్నారు. శనివారం పట్టణంలోని శాంతినగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పలువురు చిన్నారులకు పెంబి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో టీకాలు వేశారు. వెంకటమ్మ, గంగమణి, విజయలక్ష్మి, తదితరులున్నారు.

వైభవంగా పల్లకిసేవ



పాల్గొన్న భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పురాతన శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవరకోట ఆలయంలో శనివారం స్వామివారి పల్లకిసేవ వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం గోవిందా నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన గ్రామస్తులు



ఎస్సైకి పుష్పగుచ్ఛం అందిస్తున్న గ్రామస్తులు

సోన్: నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన కె.గోపిని శనివారం మండలంలోని న్యూవెల్మల్, బొప్పారం, గంజాల్ గ్రామాల మాజీ సర్పంచ్‌లు తోట సాయన్న, పాపాయి రాంఢ్డి, వెంకాయ శ్రీనివాస్‌రెడ్డి, నవీన్, గంగయ్య నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గంజాల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు



పైపులైన్ కోసం తవ్వి వదిలేసిన గుంత

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో కొద్దిరోజుల కిందట తాగునీటి పైపులైన్ ఏర్పాటు కోసం ట్యాంక్ నుంచి వసతిగృహం తవ్వి వదిలేశారు. కానీ ఇప్పటివరకు అధికారులు పైపులైన్ వేయించలేదు.. గుంత పూడ్చలేదు. దీంతో రాత్రి బయటకు వెళ్లే విద్యార్థులు ఈ గుంతలో పడి గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి పైపులైన్ వేసి తవ్విన గుంత పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

అద్దె భవనాల్లో గురుకులాలు

- పూర్తిస్థాయిలో కానరాని సౌకర్యాలు
- సొంత భవనాల్లేక అవస్థలు పడుతున్న విద్యార్థులు



రాహుల్‌నగర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న ఎంజేపీ బీసీ బాలుర పాఠశాల

భైంసాటౌన్: పేద కుటుంబాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు గత ప్రభుత్వం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసింది. అందులో చదివే వారికి నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకున్నారు. తర్వాత సదరు గురుకులాలను కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. కానీ ఆయా గురుకులాలకు సొంత భవనాలు లేకపోవడంతో అరకొర వసతుల నడుమ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

అద్దెల రూపంలో ఆర్థిక భారం..

పట్టణంలోని పలు గురుకుల పాఠశాలలు, కళాశాలలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కొన్ని పాఠశాలలకు స్థలాలు కేటాయించినా భవనాలు నిర్మించలేదు. మరికొన్నింటికి స్థలాలు లేక అద్దె భవనాల్లో నెట్టుకొస్తున్నారు. ఫలితంగా సరైన వసతులు, క్రీడా మైదానం లేక అరకొర సౌకర్యాల నడుమ గురుకులాలను కొనసాగిస్తున్నారు. ప్రైవేట్ భవనాలకు ఏటా రూ.లక్షల్లో అద్దెలు చెల్లిస్తున్నారు.. కానీ ఏళ్లు గడుస్తున్నా సొంత భవనాలు నిర్మించడం లేదు. ఆంగ్ల మాధ్యమం, వసతి సౌకర్యం ఉండటంతో గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు.. కానీ సరైన సౌకర్యాలు లేవని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు.

భైంసా పట్టణంలో ఇలా..

- భైంసా పట్టణంలో తెలంగాణ మైనార్టీ గురుకులంలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలకు సొంతభవనం లేక ఆటోనగర్‌లోని ఓ అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు.
- కుభీర్ మండలం జాం గ్రామంలో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల మంజూరవగా.. అక్కడ సరైన వసతులు లేని కారణంగా భైంసాలోని రాహుల్‌నగర్‌లో ఓ అద్దె భవనంలో నడిపిస్తున్నారు. ఏటా వర్షాకాలంలో ఎగువన గడ్డెన్న వాగు ప్రాజెక్ట్ గేట్లు ఎత్తితే ఈ రెండు గురుకులాలు వరద నీటితో ముంపునకు గురవుతున్నాయి. దీంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తుంటారు. దీంతో గురుకులాలకు సెలవులు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంటుంది.
- తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల సైతం నిర్మల్ రోడ్డులోని ఓ అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు.

వసతి గృహాలు సైతం..

భైంసాలో గురుకుల పాఠశాలలే కాక పోస్ట్‌మెట్రిక్ బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతిగృహాలు సైతం అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. దీంతో అద్దె భవనాల్లో సరైన వసతుల్లేక ఇరుకు గదుల నడుమ మధ్యన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అనుకోని ప్రమాదం జరిగితే నివారణ చర్యలు చేపట్టే వీలు లేకుండా వసతిగృహాలు ఉన్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సొంత భవనాలు నిర్మించాలి..

పట్టణంలో గురుకులాలు ప్రారంభించినప్పటి నుంచి అద్దె భవనాల్లోనే కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం భవన విస్తీర్ణాన్ని బట్టి అద్దె చెల్లిస్తున్నారు. గురుకుల పాఠశాలలు, కళాశాలలకు స్థలాలు కేటాయించి భవనాలు నిర్మించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. సొంత భవనాలు నిర్మిస్తే సరిపడా తరగతి గదులు, క్రీడా మైదానాలు సమకూరే అవకాశం ఉంటుంది. దీంతో విద్యార్థుల ప్రవేశాలు కూడా పెరుగుతాయి. ప్రైవేట్ భవనాలకు అద్దెల రూపంలో చెల్లిస్తున్న రూ.లక్షలు మిగులుతాయి.

తల్లి పేరిట మొక్క నాటి సంరక్షించాలి

- ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్



ఏరియాస్పత్రిలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్, పక్కన వైద్యులు, నాయకులు

భైంసాటౌన్: ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరిట మొక్క సంరక్షించాలని ముధోల్ ఎమ్మెల్యే పి. రామారావ్ పటేల్ అన్నారు. మాజీ కేంద్రమంత్రి, భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి పురస్కరించుకుని శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియాస్పత్రిలో మొక్కలు నాటారు. ఏక్ పేడ్ మా కే నామ్(అమ్మ పేరిట మొక్క) కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే తన తల్లి దివంగత రాధాబాయి పేరు మీద మొక్క నాటారు. అనంతరం కిసాన్‌గల్లి పశువైద్యశాలలో పెంపుడు జంతువులకు టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏరియాస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, నాయకులు గంగాధర్, కౌన్సిలర్ తోట విజయ్, గౌతం పింగ్లే, వైద్యులు అనిల్, సురేందర్, విజయానంద్, సుమలత, వనజ, పద్మావతి, పశువైద్యాధికారి విఠల్ తదితరులున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కుంటాల: మండల కేంద్రానికి చెందిన పట్లే చిన్నబాయి ఇటీవల మృతి చెందగా.. శనివారం బాధిత కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ పరామర్శించారు. మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట మాజీ ఎంపీపీ గజ్జారాం, వెంగళరావు, పసుల నవీన్, రాములు ఉన్నారు.

శ్యామప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

- మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



కడెం: ఉడుంపూర్‌లో మొక్క నాటుతున్న నేతలు



తానూరు: ఎల్వి పాఠశాల ఆవరణలో..



ఖానాపూర్: మస్కాపూర్‌లో..

కుభీర్: శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని మండలకేంద్రంలో శనివారం బీజేపీ కార్యకర్తలు మొక్కలు నాటారు. అనంతరం ప్రధాని మోదీ పిలుపు మేరకు పలువురు కార్యకర్తలు తమ తల్లి పేరిట ఒక్కో మొక్క నాటారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పి.గంగాధర్, మండలాధ్యక్షుడు ఏశాల దత్తాత్రి, నాయకులు వడ్నం నాగేశ్, మండల కార్యదర్శి మల్లేశ్, యువజన అధ్యక్షుడు నాగేశ్, శేఖర్ తదితరులు ఉన్నారు.

కడెం: మండలంలోని ఉడుంపూర్‌లో బీజేపీ నాయకులు శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్, నాయకులతో కలిసి మొక్కలు నాటారు. రాజన్న, వెంకటేశ్, శంకరయ్య, సురేశ్, శేషు తదితరులున్నారు.

లోకేశ్వరం: మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో బీజేపీ కార్యకర్తలు మొక్కలు నాటారు. ముందుగా శ్యామప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. ముధోల్ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్‌కుమార్,శ్రీకాంత్‌గౌడ్, మహేశ్‌గౌడ్, సురేందర్, సంతోష్, సాయికుమార్ ఉన్నారు.

తానూరు: మండలంలోని ఎల్వి, భోసి గ్రామాల్లో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. ఎల్వి ప్రాథమిక పాఠశాల, భోసి శిశుమందిర్ పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు చిన్నారెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, పురుషోత్తం, మారుతి, ఉపాధ్యాయులు దత్తాత్రి, ఆయా గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖానాపూర్: దేశ ఐక్యత, సమగ్రత కోసం తన జీవితం అంకితం చేసిన ఆదర్శప్రాయుడు డా.శ్యామప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ నాయకులు అన్నారు. ఆయన జయంతి పురస్కరించుకొని బీజేపీ నాయకులు పట్టణంతోపాటు మస్కాపూర్‌లో మొక్కలు నాటారు. నాయిని సంతోష్, ఎనగందుల రవి, గిరి, భూమన్న, ఇనుముల స్వామి, ఉపేందర్, కొండవేణి రమేశ్, పెద్ది రమేశ్ పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం



ముధోల్‌లో పూలమాల వేస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: స్వాతంత్య్ర సమరయోధుడు, దేశ మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. శనివారం ఆయన వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సభ్యులతో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పూదరి రాజేశ్వర్, లక్కాకుల నరహరి, ఖాజామజీదొద్దీన్, తులసి నర్సాగౌడ్, కొండ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

ముధోల్ : మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే చౌరస్తాలో శనివారం అంబేడ్కర్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ధమ్మపాల్, సభ్యులు రాహుల్, సుదర్శన్, చంద్రకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నోట్‌బుక్‌లు పంపిణీ

దస్తురాబాద్: మండలంలోని ఆకొండపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం ప్రధానోపాధ్యాయుడు కోట వేణు సొంత ఖర్చులతో నోట్‌బుక్‌లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీపై ఆకొండపేట పాఠశాలకు వచ్చిన వెంటనే విద్యార్థులకు నోట్‌బుక్‌లు లేకపోవడంతో గమనించి పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దుర్గం మల్లేశ్, మాజీ సర్పంచ్ దుర్గం పోషలింగం, గ్రామస్తులు రవి, రాజన్న, శంకర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ పంచాయతీలోని ఎస్సీ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు దాసరి శంకర్‌ను గ్రామస్తులు శనివారం ఘనంగా సన్మానించారు. 11 ఏళ్లుగా పాఠశాలలో అందించిన సేవలను గుర్తించి వీడ్కోలు సమావేశంలో సన్మానించారు. వెంకట్ రాజు, హరీశ్, రామునాయక్, మహిపాల్, శ్రీను, నరేందర్, రాకేశ్, రాజన్న తదితరులున్నారు.

పూర్వవిద్యార్థులకు సన్మానం

కుంటాల:మండలంలోని పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో చదివిన పూర్వవిద్యార్థులు కదం ధనశ్రీ, గున్నాల పవన్ ఇటీవల బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. శనివారం వీరిని పాఠశాలలో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఫణీందర్, ఎల్లన్న, ఎస్‌ఎంసీ చైర్మన్ బాబారావు, ఉపాధ్యాయురాలు ఉమారాణి, మాజీ ఉపసర్పంచ్ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కొమ్ముల మోహన్‌రెడ్డి అత్తమ్మ గంగవ్వ (75) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం బాధిత కుటుంబాన్ని డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి పరామర్శించారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటరాజు, బిట్లింగ్ నారాయణ, గంగారం, రమణ, మధు, గంగారెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

షీటీం సేవలపై అవగాహన

ఖానాపూర్: ఆకతాయిలు వేధిస్తే బాలికలు ఆందోళన చెందకుండా డయల్ 100కు ఫిర్యాదు చేయాలని ఖానాపూర్ షీటీం సిబ్బంది అన్నారు. శనివారం మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు షీటీం సేవలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా చట్టాలు, బాలనేరాలు, ఈవ్ టీజింగ్ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో నరేందర్, నర్సవ్వ, సుధీర్, సతీశ్, నరేశ్, శేఖర్, అంజయ్య, ఇమ్రాన్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సహకార దినోత్సవం

ఖానాపూర్: పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో 102వ అంతర్జాతీయ సహకార దినోత్సవం పురస్కరించుకొని నాయకులు జెండా ఆవిష్కరించారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా సహకార సంఘాలు పనిచేస్తున్నాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప సత్యనారాయణరెడ్డి, వైస్ చైర్మన్ క రిపె శ్రీనివాస్, డైరెక్టర్లు బిక్కి రాజన్న, గణేశ్, సీ ఈవో ఆశన్న, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వి జయ హైస్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కిడ్స్ అథ్లెటిక్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో వీరిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థుల్లో మీర్జా మనఫ్ బేగ్, మహిమా రెడ్డి, సిరివెన్నెల, నైనిక ఉన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మంచిర్యాల నాగభూషణం, ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ పోటీలు హైదరాబాద్‌లోని పుల్లెల గోపిచంద్ ఇంటర్నేషనల్ అథ్లెటిక్ అకాడమీలో నిర్వహించనున్నారు.

‘పోడు భూములకు హక్కు పత్రాలివ్వాలి’



మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: దశాబ్దాలుగా నిరుపేదలు సాగు చేస్తున్న పోడు భూములకు ప్రభుత్వం హక్కు పత్రాలివ్వాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.రాజు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అటవీ హక్కుల చట్టం వచ్చి రెండు దశాబ్దాలు కావొస్తున్నా.. ప్రభుత్వాలు సాగుదారులకు హక్కు పత్రాలు ఇవ్వడంలో విఫలం అయ్యాయని పేర్కొన్నారు. పాలకుల వైఫల్యంతో పేదలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారని వాపోయారు. వెంటనే సమస్యను పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గోపి నర్సయ్య, నాయకులు స్వామి, ప్రసాద్, రాజేశ్, శ్రీనివాస్, శేఖర్, గంగన్న పాల్గొన్నారు.

వర్షాకాలంలో ఇబ్బందులు రానివ్వం



నాలా పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: వర్షాకాలంలో పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పారిశుధ్య పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలో బ్రహ్మపురి మీదుగా వెళ్లే జౌలీనాలాను పరిశీలించారు. పట్టణంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గత వర్షాకాలంలో ముంపునకు గురైన జీఎన్‌ఆర్, వైఎస్‌ఆర్ కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. వారి వెంట వెంట కౌన్సిలర్ ఆకుల రామకృష్ణ, పలువురు కాలనీవాసులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

నర్సాపూర్(జి): మండలంలోని ముధోల్ నియోజకవర్గానికి చెందిన పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల నిమిత్తం రూ.15 లక్షలు మంజూరయ్యాయి. ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ చొరవతో తిమ్మాపూర్(జి)లో దత్తాత్రేయ మందిరానికి రూ.5లక్షలు, అర్లి (కే)లో పోచమ్మ ఆలయం నిర్మాణానికి రూ.5 లక్షలు, చాక్‌పల్లిలో ముస్లిం షాదీఖానా మరమ్మతుల కోసం రూ.3 లక్షలు, నందన్‌లో రాజరాజేశ్వర ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షలు మంజూరైనట్లు గ్రామస్తులు తెలిపారు. వీటి ప్రొసీడింగ్ కాపీలను మాజీ ఎంపీపీ భోజరాం పటేల్, ముధోల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోతీలాల్‌పటేల్ ఆయా గ్రామాల పెద్దలకు అందజేశారు. నిధులు మంజూరు చేయించిన మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్‌కు గ్రామాల ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

విద్యావ్యవస్థ బలోపేతానికి పాటుపడాలి



మాట్లాడుతున్న కార్యదర్శి రమణారావు

భైంసారూరల్: విద్యావ్యవస్థ బలోపేతానికి ఉపాధ్యాయులు పాటుపడాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ.వీ.రమణారావు అన్నారు. శనివారం మండలంలోని మాటేగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల బదిలీ ఉత్తర్వులు అందుకున్న ఎస్జీటీ ఉపాధ్యాయులను కొత్త స్థానాల్లోకి వెళ్లేందుకు వెంటనే రిలీవ్ చేయాలన్నారు. డీఎస్సీ నియామకాలు చేపట్టి కొత్త ఉపాధ్యాయులను నియమించేంత వరకు బదిలీ అయిన వారిని రిలీవ్ చేయకుండా పాతస్థానాల్లోనే పని చేయాలని ప్రభుత్వం ఆదేశించడం సరికాదని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను విద్యావలంటీర్లతో భర్తీ చేసి బదిలీ ఉత్తర్వులు పొందిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలని కోరారు. లేకుంటే యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పీఆర్టీయూ సంఘ సభ్యులు ఉన్నారు.

గ్రామాల్లో మొక్కలు పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీఓ శ్రీనివాస్

నర్సాపూర్(జి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని టెంబుర్ని గ్రామంలో శనివారం వన మహోత్సవంలో భాగంగా గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శైలజ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముధోల్ : మండలంలోని తరోడా గ్రామంలో శనివారం ఎంపీడీవో రాములు నాయక్ మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.

నిర్మల్‌లో పర్యటించిన పీవీ తనయుడు



నివాళులర్పించిన పీవీ ప్రభాకర్, తదితరులు

నిర్మల్‌టౌన్: మాజీ ప్రధాని పీవీ నరసింహరావు కుమారుడు పీవీ ప్రభాకర్‌రావు శనివారం నిర్మల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా శాంతినగర్ ఎక్స్ రోడ్డులో ఉన్న పీవీ కాంస్య విగ్రహానికి పీవీ ప్రభాకర్‌తో కలిసి మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు పీవీ ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించారు.

చినుకు పడితే చిత్తడే..



రోడ్డుపై నిలిచిన బురద నీరు

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి గ్రామంలో చిన్నపాటి వర్షానికే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. రోడ్లు బురదగా మారడంతోపాటు నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నామని.. అధికారులు స్పందించి రోడ్లపై బురద, నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.